31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
శనివారం,ఆగస్టు 22 ,2026
పేజీలు : 8

## విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కృషి చేయాలి

- కమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



**చురకలు విలేకరి, మెట్‌పల్లి, ఆగస్టు 21** : విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని, క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి మైనారిటీ పాఠశాలతో పాటు మెట్లచిట్టాపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులతో ఎమ్మెల్యే సంజయ్ ముచ్చటించి, వారి విద్యాభ్యాసం,

-మిగతా 2లో

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు
- రెవెన్యూ, గృహ నిర్మాణం, ఐ అండ్ పిఆర్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీకి మౌలిక వసతుల కల్పనకు తొలి దశలో రూ.32 కోట్లు
- భూ రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం.. ఏడాదిన్నరలో రీ సర్వే పూర్తి
- అర్హులైన రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు.. నకిలీ పాస్ పుస్తకాలు రద్దు
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు





**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 21** : అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సి.సి.ఎల్.ఏ. కమిషనర్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎం.డి. గౌతమ్, వెలమ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడ నరసింగరావు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తదితరులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని, సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. జగిత్యాల జిల్లాలో ఆర్డీవో కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై నిర్లక్ష్యం చేసిందని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి దశలో రూ.32 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రెండో దశలో పాఠశాల ఏర్పాటు కోసం త్వరలోనే నిధులు విడుదల చేస్తామని చెప్పారు. నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని, బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. కాలనీలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2008లో పునాది వేసిన కాలనీలో 18 సంవత్సరాల తర్వాత ప్రజలకు అవసరమైన సౌకర్యాలతో ఇళ్లు అందించగలిగామని చెప్పారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మరోసారి పత్రికా ప్రకటన ఇచ్చి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ఎలాంటి ఆందోళనలు, పోరాటాలు అవసరం లేదని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలిపారు. భూ రీ సర్వే ద్వారా రాష్ట్రంలోని అన్ని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పొంగులేటి తెలిపారు.

-మిగతా 2లో

### తప్పులు దొర్లితే
## ఎవరినీ ఉపేక్షించేది లేదు

- విధుల్లో నిర్లక్ష్యంపై ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ సస్పెన్షన్‌కు ఆదేశం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెవెన్యూ, హౌసింగ్‌పై మంత్రి పొంగులేటి సుదీర్ఘ సమీక్ష



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 21** : ప్రజా సమస్యల పరిష్కా రంలో నిర్లక్ష్యం, అవినీతి, విధుల్లో అలస త్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబో మని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇకపై రెవెన్యూ, తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు, నిర్వహిస్తానని, నిఖీల్లో తప్పులు దొర్లితే ఎవరినీ ఉపేక్షించబోనని హెచ్చ రించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మం త్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, హౌసింగ్ శాఖల అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సుమారు నాలుగు గంటల పాటు విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సమస్యలు,

-మిగతా 2లో

### నాంపల్లి గుట్టపై సుందరీకరణ
## పనులను పరిశీలించిన కలెక్టర్







**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట ఆగస్టు 21** : వేములవాడ అర్బన్ మండలం నాంపల్లిగుట్టపై వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ(వీ టీ ఏ డీ ఏ) ఆద్వర్యంలో చేపడుతున్న సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. వీటీఏడీఏ ఆద్వర్యంలో నాంపల్లి గుట్టపై ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ఇక్కడికి తరలించారు. విమానం ఏర్పాటు చేసే, ఇతర సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆ పనులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. విమానం ఏర్పాటు, సుందరీకరణ పనులను గడువులోగా పూర్తి చేసి.. భక్తులు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి

-మిగతా 2లో

## బస్టాండ్‌లో దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలి



**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 21 :** జగిత్యాల బస్టాండ్‌లో దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం జిల్లా దివ్యాంగ సంఘ నాయకులు అసర్ మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో దివ్యాంగ సంఘ నాయకులు జగిత్యాల ఆర్టిసి డిపో మేనేజర్ రమేష్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండ్ కు వచ్చే దివ్యాంగులకు ఇబ్బందులు కల్గకుండా బస్టాండ్లో ర్యాంపుల నిర్మాణం, వీల్ చైర్ ఏర్పాటు చేయాలని కోరారు. దివ్యాంగుల సంఘ నాయకుల వినతిపై డిపో మేనేజర్ రమేష్, ఎస్ఎం స్వామిలు సానుకూలంగా స్పందించారు.

## గల్ఫ్ జన సేన యూఏఈ అండ.. జగిత్యాల కార్మికుడికి సహాయం



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 21 :** దుబాయ్ లో ఏజెంట్ మోసానికి గురైన జగిత్యాల జిల్లాకు చెందిన కుంచెపు ఎల్లయ్యకు గల్ఫ్ జన సేన యూఏఈ ఎగ్జిక్యూటివ్ టీమ్ సహాయం అందించింది. ఆరోగ్య పరిస్థితి కూడా సరిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎల్లయ్యకు వసతి కల్పించడంతో పాటు, వీసా క్యాన్సిలేషన్ ప్రక్రియలో అవసరమైన సహాయం అందించారు. అంతేకాకుండా, విమాన టికెట్ను కూడా ఏర్పాటు చేసి స్వదేశానికి సురక్షితంగా చేరుకునేందుకు సహకరించారు. కష్టాల్లో ఉన్న తెలుగు రాష్ట్రాల కార్మికులకు అండగా నిలవడం గల్ఫ్ జన సేన ప్రధాన బాధ్యత అని గల్ఫ్ జనసేన యూఏఈ ఇంచార్జ్ కేసరి త్రిమూర్తులు పేర్కొన్నారు. గల్ఫ్ జనసేన నేషనల్ కన్వీనర్ మొగళ్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రవాసాంధ్రుల కు గల్ఫ్ జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఎల్లయ్య గల్ఫ్ జనసేన యూఏఈ ఎగ్జిక్యూటివ్ టీమ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## 16వ వార్డులో దోమల నివారణకు చర్యలు



**చురకలు విలేకరి, మెట్ పల్లి, ఆగస్టు 20 :** మెట్ పల్లి పట్టణంలోని 16వ వార్డులో దోమల విజృంభనతో వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా నేపథ్యంలో శుక్రవారం వార్డు కౌన్సిలర్ అరిసె వనజ మురళి చర్యలు చేపట్టారు. సొంతఖర్చులతో దోమల నివారణకు మందు పిచికారి చేయించారు. ఈ సందర్బంగా కౌన్సిలర్ అరిసె వనజ మురళి మాట్లాడుతూ వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మ్యాడం గోపి, ముఖేష్, అఖిల్, నరేష్, భూమేష్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి గుట్టపై సుందరీకరణ

**మొదటి పేజీ తరువాయి...** ఆలయంలో జిల్లా కలెక్టర్ పూజలు నాంపల్లి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికారు. స్వామి వారికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ కు తీర్థ ప్రసాదాలు అందజేసి.. ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, తహసీల్దార్ జయంత్ కుమార్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

**మొదటి పేజీ తరువాయి....**
ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి భూ రీ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. జగిత్యాల జిల్లాలో కూడా ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందన్నారు. రీ సర్వే అనంతరం అర్హులైన రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నకిలీ పాస్ పుస్తకాలను గుర్తించి రద్దు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు ప్రయోజనాలు పొందేందుకు అర్హత లేని వారికి, నకిలీ పాస్ పుస్తకాల ఆధారంగా ప్రయోజనాలు అందిన పరిస్థితులు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. భూ రీ సర్వే అనంతరం నిజమైన రైతుల హక్కులను పరిరక్షిస్తూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో పెండింగ్ పనులు పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించేందుకు రూ.72 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పాత, ప్రస్తుతం వినియోగంలో లేని ట్రాక్టర్ ఉన్న కారణంగా కొందరు అర్హులు నష్టపోతున్నారని తెలిపారు. అలాంటి అర్హులైన కుటుంబాలకు నిబంధనల్లో సడలింపు కల్పించాలని రెవెన్యూ మంత్రిని కోరారు. ధర్మపురి ప్రజల చిరకాల కోరిక అయిన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, ధర్మపురిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేయాలని మంత్రి పొంగులేటిని కోరారు. మాల్యాల మండలంలో చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కాలనీలో ప్రాథమిక పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాలనీలో రహదారులు, చర్చ్, ఆలయం, మసీదు, రేషన్ దుకాణం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. నూకలపల్లి కాలనీని మున్సిపాలిటీలో విలీనం చేయడానికి చర్యలు తీసుకుంటున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టీఆర్ నగర్, నూకలపల్లిని జగిత్యాల పట్టణంలో విలీనం చేయాలని కోరారు. జిల్లాలోని సుమారు 100 మంది సీనియర్ జర్నలిస్టుల కోసం జర్నలిస్టు కాలనీ ఏర్పాటు చేయాలని, భీంపూర్ నూతన మండలానికి తహసీల్దార్ కార్యాలయం మంజూరు చేయాలని, రాయికల్ మున్సిపాలిటీకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ పేదలకు గౌరవప్రదమైన ఇళ్లు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో 4,500 ఇళ్లు నిర్మించబడ్డాయని, అయితే ప్రస్తుతం సుమారు 50 శాతం ఇళ్లలో మాత్రమే ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. కాలనీలో మిగిలిన ఇళ్లలో కూడా ప్రజలు నివసించేలా రవాణా, సెల్‌ఫోన్ టవర్లు తదితర అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలని కోరారు. 4,500 ఇళ్లతో నూకలపల్లి ఒక చిన్న టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. బ్లాక్‌ల వారీగా ఇళ్లకు నంబర్లు కేటాయించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో మొత్తం 10,365 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 2,208 ఇళ్లు నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు 8,079 మంది లబ్ధిదారులకు రూ.227 కోట్ల 32 లక్షలు విడుదల చేసినట్లు వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 4,710 ఇళ్లు పూర్తయ్యాయని, 4,386 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, మరో 324 మంది లబ్ధిదారుల ఎంపిక చేయాల్సి ఉందని తెలిపారు. జిల్లాలో మొత్తం 1,562 గుడిసెలను గుర్తించగా, 1,319 గుడిసెలను పరిశీలించి ధ్రువీకరించినట్లు కలెక్టర్ వివరించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. వెలమ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నరసింగరావు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను స్వాగతించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమం ముగింపులో చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేశారు. అనంతరం 12 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, అదనపు కలెక్టర్లు రాజ గౌడ్, జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, నరసింహారావు, జీవాకర్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగజ్యోతి, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్, కోరుట్ల మున్సిపల్ చైర్మన్, రాయికల్ మున్సిపల్ చైర్మన్, ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## తప్పులు దొర్లితే ....

**మొదటి పేజీ తరువాయి...** భూ రీ సర్వే, 22-ఏ కేసులు, భూ భారతి దరఖాస్తులు, అసైన్డ్ భూముల సమస్యలపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈరోజు సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన ఆదేశాలను నేటి నుంచే కార్యాలయాల్లో అమలు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష కేవలం మొదటి సమావేశం మాత్రమేనని, ఇకపై ఆకస్మిక తనిఖీలు, నిరంతర పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

తహసీల్దార్ సస్పెన్షన్‌కు ఆదేశం...

విధుల్లో నిర్లక్ష్యం వహించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. మరికొంత మంది అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. అధికారులు పద్ధతి మార్చుకోవాలి.. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. అధికారులు తమకు కేటాయించిన హెడ్‌క్వార్టర్లలో నివాసం ఉంటున్నారా లేదా అనే అంశంపై నివేదిక తెప్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజలతో అధికారులు, సిబ్బంది గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో చిన్న రెవెన్యూ సమస్యను కూడా అధికారులు గుర్తించి పరిష్కరించాలన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖపై ఉన్న అవినీతి మచ్చను చెరిపేలా అధికారులు పనిచేయాలని అన్నారు. అవినీతి ఆరోపణలు వచ్చిన అధికారులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలితే సస్పెన్షన్‌తో సహా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసేందుకు రూ.లక్ష డిమాండ్ చేసినట్లు మహిళ ఫిర్యాదు చేసిన ఘటనపై సంబంధిత తహసీల్దార్‌కు ఛార్జ్ మెమో జారీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్లకు సమాచారం ఇవ్వకుండానే ఆకస్మిక తనిఖీలకు వస్తానని మంత్రి స్పష్టం చేశారు. భూ రీ సర్వే పనులను పెండింగ్‌లో పెట్టే అధికారులపై చర్యలు తప్పవన్నారు. లైసెన్సు సర్వేయర్లకు ప్రతి 15 రోజులకు ఎకరాకు రూ.60 చొప్పున చెల్లించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశలోని ఎల్-3 సమస్యలను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని, రెండో దశ ఇళ్ల మంజూరుకు ముందు లబ్ధిదారుల అర్హతను రెండుసార్లు పరిశీలించాలని ఆదేశించారు. 22-ఏ, అసైన్డ్ భూముల కేసులను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే 24 గంటలూ పనిచేసి కేసులను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశం ప్రారంభం మాత్రమేనని.. ఇకపై కార్యాలయాల పనితీరు, అధికారుల విధి నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## విద్యార్థులు లక్ష్యసాధన దిశగా ...

**మొదటి పేజీ తరువాయి...** లక్ష్యాలు, భవిష్యత్ ఆశయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడిన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్.. విద్యార్థి దశలోనే జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, ఇతర సృజనాత్మక రంగాల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి.. మీ తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సంజయ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలల అవసరాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు అందుతున్నాయా అనే విషయాలను పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఎమ్మెల్యే సంజయ్ ఆత్మీయంగా ముచ్చటించడం, వారి లక్ష్యాలు తెలుసుకుని ప్రోత్సహించడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## పల్లె దవాఖానలో హెచ్‌పీవీ టీకాలు



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (21) : గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని పల్లె దవాఖానలో శుక్రవారం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 11మందికి హెచ్‌పీవీ టీకాలు వేశారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా ముందస్తు జాగ్రత్తగా హెచ్‌పీవీ టీకా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ రమణ, ఎమ్మెల్ హెచ్ పి గణేష్, హెచ్ ఎస్ శుశీల, ఏఎన్ఎం భవాని, ఆశా కార్యకర్తలు వినోద, ప్రమీల, వనిత తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం



చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు,21 : తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కొమిరెడ్డి లింగారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. జగిత్యాల జిల్లా అధికారిక పర్యటనలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ ఆవరణకు చేరుకున్న మంత్రికి భారీ ఎత్తున స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొమిరెడ్డి లింగారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మంత్రిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండలింగాపూర్ మాజీ ఉపసర్పంచ్ గంగోని బాలయ్య, డబ్బా గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు జానాశంకర్, వర్షకొండ విడిసి సభ్యుడు రామగిరి శేఖర్, ఎర్రాపూర్ వార్డు సభ్యులు ప్రతాప్ నాయక్, మధు నాయక్, వెంకట్రావుపేట యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్యను పటిష్టం చేయడమే ఎఫ్ఎల్ఎన్ లక్ష్యం

చురకలు విలేకరి, మెట్‌పల్లి, ఆగస్టు 21 : ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో భాషా, గణిత నైపుణ్యాలను పెంపొందించి, అభ్యసన లోపాలను అధిగమించడమే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ లక్ష్యమని వెల్లుల్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గద్దం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లుల్ల కాంప్లెక్స్‌లో ప్రాథమిక తరగతులకు బోధించే ఉపాధ్యాయులతో తొలి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, వెనుకబడిన విద్యార్థులకు ప్రతిరోజూ రెమెడియల్ తరగతులు నిర్వహించాలని సూచించారు. "ఐ బ్రీత్‌ఇన్ ఎఫ్ఎల్ఎన్-బ్రీత్ అవుట్ ఎఫ్ఎల్ఎన్" స్ఫూర్తితో ఉపాధ్యాయులందరూ సమష్టిగా కృషి చేసి ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఆర్‌పీలు నర్సింగరావు, మల్లేశం, రాజేంద్రప్రసాద్, సీఆర్‌పీలు లక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభం



చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్,ఆగస్టు 21 : మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో (బిఐఆర్‌ఈడి) సంస్థ వారి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం రైతు వేదిక ప్రాంగణంలో మహిళలతో కలిసి ప్రారంభించారు. ఈ 38రోజుల శిక్షణ కార్యక్రమంలో మహిళలు ఉచితంగా ఇచ్చే కుట్టుమిషన్, ఎంబ్రాయిడింగ్ డిజైన్‌శిక్షణలను శ్రద్ధగా నేర్చుకోవాలని ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనగందుల లక్ష్మి సంజీవ్, ఉపసర్పంచ్ రాకేష్ పటేల్, ఈఓ భూమేష్, బ్యాంకర్స్ అసోసియేషన్ సిబ్బంది మరియు గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం



చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 21 : కోరుట్ల నియోజకవర్గం కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు హాజరైన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి శుక్రవారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ్ రావు ఘన స్వాగతం పలికారు. మెట్‌పల్లి పట్టణంలోని జువ్వాడి నర్సింగ్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గంలో ఆర్డీవో, ఎంఆర్‌ఓ కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని జువ్వాడి నర్సింగ్ రావు మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

అనంతరం మెట్‌పల్లి పట్టణంలోని 8వ వార్డులో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జువ్వాడి నర్సింగ్ రావుతో కలిసి మొక్కలు నాటారు. తర్వాత కోరుట్ల పట్టణంలోని వెటర్నరీ కళాశాల సమీపంలో ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి,దివంగతనేత జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జువ్వాడి నర్సింగ్ రావు, జువ్వాడి కృష్ణారావులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి జువ్వాడి నర్సింగ్ రావు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సమావేశంలో జువ్వాడి నర్సింగ్ రావు మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గంలో కోరుట్ల,మెట్‌పల్లి రెండు మున్సిపాలిటీలు ఉన్నందున నియోజకవర్గ అవసరాలను దృష్టిలో ఉంచుకొని అదనంగా మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి,ప్రజల అవసరాల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి జువ్వాడి నర్సింగ్ రావు పాల్గొన్నారు.

# రూపారెడ్డి మృతి ఘటనను టీఆర్ఎస్ఎంఏ తీవ్రంగా ఖండించింది

**-ఉపాధ్యాయుల భద్రతకు కఠినమైన చట్టాలు తీసుకురావాలి**



చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 21 : నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి నాగార్జున పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపా రెడ్డి పదో తరగతి విద్యార్థుల చేతిలో మృతి చెందిన ఘటనను తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (టీఆర్ఎస్ఎంఏ) కోరుట్ల తీవ్రంగా ఖండించింది. ఘటనపై వేగవంతమైన నిష్పక్షపాత దర్యాప్తు నిర్వహించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనను నిరసిస్తూ ఉపాధ్యాయ సమాజానికి సంఘీభావంగా టీఆర్ఎస్ఎంఏ కోరుట్ల ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం, కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ఎంఏ కోరుట్ల అధ్యక్షుడు ఎం.ఏ. బారి మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచి,వారు ఏం చేస్తున్నారు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారనే విషయాలను గమనించాలని సూచించారు. ఉపాధ్యాయుల గౌరవం భద్రత ప్రతిష్ఠ కోసం టీఆర్ఎస్ఎంఏ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రూపారెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని ఘటనపై త్వరితగతిన నిష్పక్షపాత దర్యాప్తు నిర్వహించాలని టీఆర్ఎస్ఎంఏ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు పాఠశాలల భద్రత కోసం కఠినమైన చట్టాలను తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ కోరుట్ల కార్యదర్శి గుజ్జెటి వెంకటేష్ కోశాధికారి దీపక్ పాఠశాల కరస్పాండెంట్లు సత్యనారాయణ మహదేవ్ శంకర్ చౌకి రమేష్ దామోదర్ సిద్ధార్థ రాజేంద్ర ప్రసాద్ సుకుమార్ తదితరులతో పాటు వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సరస్వతి శిశు మందిర్‌లో ఘనంగా వరలక్ష్మీ వ్రతం



చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 21 : కోరుట్లలోని సరస్వతిశిశుమందిర్ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో వరలక్ష్మీవ్రత పూజాకార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రఐఎంఏ మహిళా విభాగం చైర్మన్ డాక్టర్ స్వీతిఅనూప్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వీతి అనూప్ రావు మాట్లాడుతూ వరలక్ష్మీ వ్రతం భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కుటుంబ సుఖ సంతోషాలు ఆరోగ్యం ఐశ్వర్యం కోసం మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ అమ్మవారిని పూజించడం మన సంప్రదాయంలో భాగమని తెలిపారు. విద్యార్థుల్లో చిన్న నాటి నుంచే భారతీయ సంస్కృతి సంప్రదాయాలపట్ల అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల ప్రబంధకారిణి అధ్యక్షులు డాక్టర్ వేములవాడ కిరణ్,ప్రధాన కార్యదర్శి వనపర్తి చంద్ర మోహన్, కోశాధికారి నీలి శ్రీనివాస్,కార్యవర్గ సభ్యులు అందె శివప్రసాద్, ఉపాధ్యాయులు,విద్యార్థులు,మహిళా భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది.

## అంగన్వాడీ కేంద్రంలో ఉచిత యూనిఫాంలు పంపిణీ చేసిన జువ్వాడి కృష్ణారావు



చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 21 : కోరుట్ల పట్టణంలోని 17వ వార్డు అరఫాత్‌పూర్ - కాగజీపూర్ అంగన్వాడీ సెంటర్-2లో శుక్రవారం చిన్నారుల కు ఉచిత యూనిఫాంల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్,17వ వార్డు కౌన్సిలర్ సోగ్రబి,అక్బర్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతంరాజం హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ చిన్నారులకు పాఠశాల యూనిఫాంలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అంబల్ల రాజమణి కృతజ్ఞతలు తెలిపారు. వార్డు ప్రజలు, చిన్నారుల తల్లులు కార్యక్రమంలో పాల్గొని యూనిఫాంల పంపిణీకి సహకరించి నందుకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది చిన్నారులు తల్లులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## సోమేశ్వరకొండ రాజగోపురం స్థల పరిశీలన



చరకలు విలేకరి, మల్లాపూర్, ఆగస్టు 21 : మల్లాపూర్ మండల కేంద్రంలోని కనక సోమేశ్వర స్వామి కొండ పై రాజగోపురం నిర్మించడానికి శుక్రవారం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రధాన స్థపతివల్లి నాయగం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించి కొండపై భక్తులకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను పరిశీలించి రూ.50లక్షలతో నిర్మించనున్న రాజగోపురం స్థలాన్ని పరిశీలించి ఆలయ కమిటీ సభ్యులకు పలు సూచనలిచ్చారు. అనంతరం ఆలయ కమిటీసభ్యులు ఆయనను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఆలయ కమిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీనియర్ సిటిజెన్స్ దినోత్సవం



చరకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 21 : తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సీనియర్ సిటిజెన్స్ దినోత్సవం వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కని పెంచి ప్రయోజకులను చేసినా వృద్ధాప్యం లో వారి సంతానం వారి తల్లిదండ్రులను పట్టించుకోక పోవడం, వేధింపులకు గురి చేయడం పట్ల ఆందోళన ప్రదర్శన నిర్వహించారు.అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 12 మంది సీనియర్ సిటిజెన్స్ పబ్బా శివానందం, వొజ్జెల బుచ్చి రెడ్డి, కండ్ల గంగాధర్,ఎం. డీ. యాకూబ్, ఎం. డీ. ఇక్బల్, ఉప్పుగళ్ళ మురళి, దుబ్బే శం, సత్యనారాయణ, మిర్యాల రాజన్న, వీరారెడ్డి, కరుణ, విజయలక్ష్మి లను జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, రిటైర్డ్ జిల్లా అటవీ శాఖ అధికారి పూసాల అశోక్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జీ ఆర్ దేశాయ్ ల చేతుల మీదుగా అవార్డులు అందజేసి శాలువాలతో సన్మానించారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి విశ్వ నాథము,సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్, కోశాధికారి వెల్లుల ప్రకాష్ రావు, రిటైర్డ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సయ్యద్ యూసుఫ్, సీనియర్ జర్నలిస్ట్ సౌదాల కమలాకర్,మద్దెనపెల్లి స్వామి,జిల్లా, డివిజన్, మండలాల, గ్రామాల సీనియర్ సిటిజెన్స్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యుత్ సిబ్బంది సేవలు అభినందనీయం



చరకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, ఆగస్టు 21 : ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం డబుల్ బెడ్రూం ఇండ్లల్లో కొత్త లైన్ వేసి వీధి దీపాలను అమర్చినట్లు సర్పంచ్ చిట్యాల రాజారాం అన్నారు. మండలంలోని ఆత్మకూర్ గ్రామ డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించిన నాటి నుంచి నేటికీ విద్యుత్ దీపాలు లేక కాలనీవాసులు ఇబ్బందిపడగా విద్యుత్ అధికారులు,సిబ్బంది సహకారంతో వీధి దీపాలను అమర్చారు.అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో స్వాతంత్ర దినోత్సవ రోజున జిల్లా ఉన్నతధికారుల చేతుల మీదగా విద్యుత్ సేవలో ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్న లైన్మెన్ శేఖర్, లక్ష్మణ్,జెఎల్ఎం అజయ్ ను శాలువాతో సత్కరించి అభినందించారు.ఇందులో ఉపసర్పంచ్ కసడి తిరుపతి,వార్డ్ సభ్యులు సుధాకర్,విడిసి చైర్మెన్ సంపత్,వైస్ చైర్మన్ రవి,దుద్దుల తిరుపతి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వినతి**



చరకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 21: జగిత్యాల జిల్లాలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు హెల్త్ కార్డులు, రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు.జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య నాయకత్వంలోని జగిత్యాల జిల్లా ఫెడరేషన్ నాయకులు కలిసి సమస్యల ను వివరించారు. జగిత్యాల పట్టణంలోని జర్నలిస్టులకు దాదాపు 20 ఏళ్లుగా ప్రభుత్వం ఎలాంటి నివేశన స్థలాలు కేటాయించలేదని తెలిపారు. గతంలో ధరూర్‌క్యాంపు,నరసింగాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ భూములను సర్వే చేసి స్థలాలను సిద్ధం చేసినప్పటికీ ఇప్పటివరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని పేర్కొన్నారు. జిల్లా కేంద్రం జగిత్యాలలో ప్రింట్, ఎలక్ట్రానిక్ తదితర మీడియా సంస్థల్లో సుమారు 200 మంది జర్నలిస్టులు పని చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే నివేశన స్థలాలు కేటాయించాలని, హెల్త్ కార్డులు అందించాలని, రాష్ట్రవ్యాప్తం గాజర్నలిస్టులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు.స్పందించిన రెవెన్యూ, గృహ నిర్మాణ,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి జగిత్యాల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ జగిత్యాల జిల్లా కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ఇమ్రాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేన్నేని రవీందర్ రావు, కోశాధికారి శ్రీనివాసరావు,ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎన్. జయపాల్,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆముద లింగారెడ్డి, సీనియర్ పాత్రికేయులు టీ జే ఏ జిల్లా అధ్యక్షులు, జిల్లా అక్రిడేటేషన్ కమిటీ సభ్యులు ద్వావర సంజీవ రాజు, సహాయ కార్యదర్శి అనంతుల కాంతారావు, రాగం రమేశ్, మాణిక్యం గంగాధర్, శ్రీశైలం లు మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

# లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం

**-రోడ్లు, సెల్ టవర్, నీటి వసతులు, పాఠశాల, ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని హామీ**

**-లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశం చేసిన మంత్రి పొంగులేటి**



చరకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 21 : నూకపల్లి 2బీహెచ్‌కే గృహ సముదాయంలో నివసిస్తున్న లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం నూకపల్లి 2బీహెచ్‌కే గృహ సముదాయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగుల, ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సి.సి.ఎల్.ఏ. కమిషనర్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎం.డి. గౌతమ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌లతో కలిసి మంత్రి పరిశీలించారు. మిషన్ భగీరథ ట్యాంక్ పైకి వెళ్లి అక్కడి నుంచి నూకపల్లి గృహ సముదాయాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి కాలనీలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో ఇళ్లతో పాటు అవసరమైన మౌలిక వసతుల పనులను కూడా చేపట్టినట్లు మంత్రి తెలిపారు. 160 ఇళ్ల ప్రాంతంలో సెప్టిక్ ట్యాంకులు, వాటర్ డ్రెయిన్, సీవరేజ్ లైన్ల నిర్మాణానికి రూ.52.57 లక్షలు మంజూరు చేసి రూ.51.09 లక్షలు వ్యయం చేశారని తెలిపారు. 360 ఇళ్ల ప్రాంతంలో ఇదే తరహా పనులకు రూ.99.25 లక్షలు మంజూరు చేసి రూ.88.48 లక్షలు వ్యయం చేసినట్లు వివరించారు. 4,000 ఇళ్ల ఫేజ్-2 ప్రాంతంలో సెప్టిక్ ట్యాంకులు, సీవరేజ్ లైన్లు, ఇన్‌స్పెక్షన్ చాంబర్లు, వాటర్ డ్రెయిన్లు, మెయిన్ డ్రెయిన్, అంతర్గత డ్రెయిన్ల నిర్మాణానికి రూ.11.30 కోట్ల మేర నిధులు మంజూరు కాగా, రూ.10.81 కోట్ల మేర వ్యయం చేసినట్లు తెలిపారు. 4,000 ఇళ్ల ప్రాంతంలో విద్యుత్ లైన్లు, ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డుల ఏర్పాటుకు రూ.6.05 కోట్లు మంజూరు చేసి రూ.5.01 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు. 4,000 ఇళ్ల ప్రాంతంలో సెప్టిక్ ట్యాంకులు, సీవరేజ్ లైన్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులకు రూ.5 కోట్లు మంజూరు చేసి రూ.4 కోట్లు వ్యయం చేసినట్లు వివరించారు. 4,520 ఇళ్లకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా పనులు పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. కాలనీలో ఇప్పటికే పలు మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని, మిగిలిన అవసరాలను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో లబ్ధిదారులతో మంత్రి నేరుగా మాట్లాడారు. కాలనీలో రోడ్లు, సెల్ టవర్, తాగునీటి వసతులు, పాఠశాల, ఆసుపత్రి వంటి సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు మంత్రిని కోరారు. లబ్ధిదారులు తెలిపిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. రోడ్లు, సెల్ టవర్, నీటి వసతులు, పాఠశాల, ఆసుపత్రి వంటి అవసరమైన మౌలిక సదుపాయాలను మూడు నెలల్లోగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. కేంద్రంలో ఉన్న చిన్నారుల కు అక్షరాభ్యాసం చేశారు.పిల్లల సంఖ్య, వారికి అందుతున్న వసతులు, ఇంకా అవసరమైన సౌకర్యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మెరుగైన వాతావరణం కల్పించేలా అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.2బీహెచ్‌కే ఇళ్ల నిర్మాణంతో పాటు కాలనీల్లో అవసరమైన రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. లబ్ధిదారులు సౌకర్యవంతంగా జీవించేలా నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో మిగిలిన అవసరాలను కూడా ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.



# వరాల దేవుడు శ్రీ ఆది వరహస్వామి



**జబ్బార్ ఖాన్,చురకలు ప్రతినిధి, కమాన్ పూర్,పెద్దపల్లి జిల్లా :** పెద్దపల్లి జిల్లాలోని కమాన్ పూర్ గ్రామంలో స్వయంభూగా వెలసిన స్వామి శ్రీ ఆదివరాహస్వామి. ఆ స్వామి అవతరించిన మాసం ఈ పవిత్ర శ్రావణమాసం.శ్రీ మహావిష్ణువు యొక్క దశావతారాలలో వరాహావతారం ప్రసిద్ధమైనది. హిరణ్యాక్షుడు భూమిని చాపగా చుట్టి సముద్రగర్భంలో దాక్కున్నప్పుడు ఆదివరాహ రూపముగా వచ్చి భూదేవిని ఉద్ధరించాడు ఆ శ్రీమన్నారాయణుడు. ఆ స్వామి యొక్క అవతారాలలో ఇది మూడవది. అలాంటి మహిమాన్వితమైన వరాహస్వామికి మన దేశంలో ఆలయాలు చాలా తక్కువ. మన తెలుగు రాష్ట్రాలలో కేవలం స్వయంభూ వరాహ దేవాలయాలు రెండు ప్రాంతాల్లో దర్శనమిస్తాయి. అందులో ఒకటి తిరుమలపై, మరొకటి కమాన్ పూర్ గ్రామంలో ఉండడం విశేషం. తిరుమల కొండపై ప్రథమ పూజలను వేంకటేశ్వరస్వామి కంటే ముందు వరాహస్వామి అందుకుంటాడు. ఎందుకంటే కలియుగ ప్రారంభంలో శ్రీవారు లక్ష్మీదేవిని వెతుక్కుంటూ వైకుంఠం నుంచి భూమికి దిగివచ్చినప్పుడు వరాహస్వామి ఆయనకు ఆశ్రయమిచ్చారని పురాణ కథనం. అందుకు ప్రతీకగా తిరుమలను సందర్శించే భక్తులు తొలుత వరాహస్వామిని దర్శించాకే తనను దర్శించాలని నియమాన్ని ఏర్పరిచినాడు వేంకటేశ్వరస్వామి.అలాగే మన కమాన్ పూర్ ఒక శిలపై ఆదివరాహస్వామి వెలిసారు. చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందిన ఈ స్వామి క్షేత్రం ప్రత్యేకత ఏమిటంటే ప్రతి సంవత్సరం కొంత కొంత పెరుగుతూ ఉంటాడు. అలాగే పూర్వం వెంట్రుకలు కూడా కనబడటం విశేషం. 600 సంవత్సరముల క్రితం ఋషి తపస్సు చేస్తే కలలో దర్శనమిచ్చి ఋషి కోరిక మేరకు శిలపై వరాహావతారంలో వెలిసారు. దేశ విదేశముల నుండి భక్తులు వచ్చి ఈ స్వామిని దర్శించుకుంటారు. అలాగే నవగ్రహ దోషములు అన్ని ఈ స్వామి దర్శనం వల్ల తొలుగుతాయి. సంతాన, భూ, ధన, విద్యా ఉద్యోగ, వివాహాది సమస్యలు ఉన్నవారు ఈ స్వామిని ప్రార్థించి బాధలు పోగొట్టుకుని మొక్కులు తీర్చుకుంటారు. సకల శు భాలను ప్రసాదించే సిద్ధి వరాహక్షేత్రం ఇది అని భక్తుల పరమ విశ్వాసము.అలాంటి ఆదివరాహస్వామికి మూడురోజుల పాటు జయంత్యుత్సవాలు జరుగుచున్నవి. ఇందులో ఈనెల 23వ తేదీ నుండి26 వ తేదీ వరకు ఆదివరాహస్వామి జయంతి సందర్భంగా 108 కలశాలతో అభిషేకము జరుగును కనుక మనమందరం స్వామివారి జయంత్యుత్సవాలలో పాల్గొని స్వామివారి కరుణా కటాక్ష వీక్షణాలకు పాత్రులమవుదాం.శ్రీ ఆదివరాహస్వామి దర్శనం సర్వపాప వినాశనం. అలాగే ఇక్కడ స్వామి వారి పాదా ముద్రలు స్పష్టంగా కనిపిస్తాయి. మరో బండపై ఈ పాదముద్రలు దర్శనం ఇవ్వడం జరుగుతుంది. గత 30 సంవత్సరాల క్రితం ఆలయ ప్రాంగణాన్ని సంస్థ వారు డోజర్ పెట్టి చదును చేస్తున్న సమయంలో ఆ డోజర్ కు పాదముద్రల తాకడంతో డోజర్ అక్కడే నిలిచిపోయింది. దీంతో తీరా చూడగా అక్కడ స్వామివారి పాదాలు దర్శనమిచ్చాయి. ఒక భక్తుడు తమ కోరికలు తీరిస్తే మందిరాన్ని నిర్మిస్తానని మొక్కలు మొక్కుకోగా అప్పుడు స్వామి వారు మొక్కలు తీర్చారు. అనంతరం ఆయన పైన గుడి కట్టేందుకు సిద్ధం కాగా స్వామి వారు కలలో కనిపించి ఇక్కడ గుడి కట్టకూడదని చెప్పడంతో ఆ భక్తుడు విరమించుకున్నాడు. ఆలయ ఆవరణలో సుబ్రహ్మణ్యస్వామి నాగదేవత కూడా కనిపిస్తారు. ప్రతి ఆదివారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోతుంది,. భక్తులు నిత్యం అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. అలాగే స్వామివారి జయంతి ఉత్సవాలకు ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఆలయ ఈవో కొసనకాంతరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు కల్వకుంట్ల వరప్రసాదాచార్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అసంపూర్తిగా ఉన్న రోడ్డుకు మంత్రి శ్రీధర్ బాబు 90 లక్షల రూపాయల నిధులతో రోడ్డును పూర్తి చేయించారు.నాలుగు రోజులపాటు జరిగే జయంతి ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా ఆంధ్ర ప్రాంతం నుండి సైతం భక్తులు భారీ ఎత్తున హాజరుకానున్నారు.

**-రాష్ట్రంలోనే ప్రసిద్ధమైన క్షేత్రం**
**-శ్రావణంలో జయంతి ఉత్సవాలు**
**-కోరిన కోర్కెలు తీర్చే స్వామి శ్రీ ఆదివారహ స్వామి**

**భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలి...**

**ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్....**

ఈనెల 23 నుండి 26వ తేదీ వరకు నిర్వహించే శ్రీ ఆదివరాహస్వామి జయంతి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని శ్రీ ఆది వరహాస్వామి ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ కోరారు.భక్తుల సౌకర్యార్థం పూర్తి ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద అన్ని బస్సులు నిలుపుదల చేస్తాయని పేర్కొన్నారు.జయంతి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని పేర్కొన్నారు.



# పోక్సో కేసులో నిందుతుడికి 04 సంవత్సరాల జైలు శిక్ష

**-2000/- రు.జరిమానా**

**-శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులను, పీపీ లను, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఆగష్టు 21 :** గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికల పట్ల ఆసభ్యకరంగ ప్రవర్తించిన (పోక్సో) కేసులో నిందుతుడీకి 04 సంవత్సరాలు జైలు శిక్ష మరియు 2000/-రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ శుక్రవారం రోజున తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.


**కేసు వివరాలు..**

గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక పాఠశాల ప్రాంగణంలో గోడా ధూకి బాలికలతో అగదండి రాజేందర్ అనే వ్యక్తి ఆసభ్యకరంగ ప్రవర్తించగా , పాఠశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు మెరకు గంభీరావుపేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి అప్పటి గంభీరావుపేట ఎస్.ఐ మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడిని రిమాండ్ కి తరలించడాం జరిగింది.అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ లు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్, పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 10మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాన్సీ వాదించగా,శాస్త్రీయ ఆధారాలు,సాక్షులను పరిశీలించిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన అగదండి రాజేందర్ కు గా4 సంవత్సరాలు జైలు శిక్ష మరియు 2000/-జరిమాన విధించారు.సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని,శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ తెలిపారు.పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ సమన్వయంతో వ్యూహాత్మకంగా న్యాయ విచారణ,న్యాయ నిరూపణ నిర్వహించి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఈకేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి ఎస్ఐ మహేష్, ప్రస్తుత డిఎస్పీ నాగేంద్రచారి , పబ్లిక్ ప్రాసిక్యూటర్ ,జాన్సీ,ఎల్లారెడ్డిపేట్ సర్కిల్ సి.ఐ ఓ.వెంకటేష్ గంభీరావుపేట ఎస్.ఐ శ్రీకాంత్,కోర్టు మానిటరిశీగ్ ఎస్.ఐలు రవీందర్ నాయుడు,శ్రవణ్ యాదవ్ ,కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్,ఎఎం కానిస్టేబుల్ నవీన్, పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల లను , లీగల్ సపోర్ట్ పర్సన్ లహరిక లను జిల్లా ఎస్పీ అభినందిచారు.

# ఫ్రెండ్లీ సూపర్ మార్కెట్‌లో దొంగతనం

**-సబ్బులు సదిరిన సంచిని వదిలి వెళ్ళిన దొంగ**





**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట ఆగష్టు 21 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఫ్రెండ్లీ సూపర్ మార్కెట్ కు చెందిన షట్టర్ తాళాలు పగలగొట్టిన దొంగ లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డాడు.సూపర్ మార్కెట్ పక్కనే ఉన్న హోటల్యజమాని వేకువ జమున సుమారు మూడు గంటల సమయంలో తన హోటల్ తీయడానికి వచ్చి సూపర్ మార్కెట్ షట్టర్ తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి సూపర్మార్కెట్ యజమానికి సమాచారం అందించారు. షాపు వద్దకు చేరు కున్న యజమాని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసు లు పరిస్థితిని సమీ క్షించి దర్యాప్తు చేస్తున్నారు.కాగా చేతి సంచిలో సబ్బులు బిస్కట్ ప్యాకెట్లు సదిరిన దొంగ చేతి సంచిని షాపు ముందు వదిలి వెళ్ళడంతో దొంగతనం చేసింది చిల్లర దొంగా లేక షాపులో ఇంకా ఏమైనా పెద్ద ఎత్తున నగదు వస్తువులు చోరీ అయ్యాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తుంది.సీసీ కెమెరాను వంచడం మెయిన్ రోడ్డులో గల షటర్ తాళాలు పగల గొట్టి చోరికి పాల్పడడంతో దొంగతనం చేసింది ఒక్కడేనా ఇంకా ఎవరైనా ఉన్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయని గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు.

## రూపా రెడ్డి హత్యకు నిరసనగా

# ఉపాధ్యాయుల శాంతియుత కొవ్వొత్తుల ర్యాలీ



**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగష్టు, 21 :** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో పాఠశాల ప్రిన్సిపల్ కె.రూపా రెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ, ఉపాధ్యాయుల భద్రతను కోరుతూ నిర్మల్ డిస్ట్రిక్ట్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతియుత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు కొవ్వొత్తులు చేతబట్టి ర్యాలీలో పాల్గొని రూపా రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. రూపా రెడ్డి హత్య ఘటనను ఉపాధ్యాయ సంఘం తీవ్రంగా ఖండించింది. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ భయాందోళనలకు గురికాకుండా పాఠశాలల్లో సురక్షిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సంఘం నాయకులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "ఉపాధ్యాయులపై దాడులు ఆపాలి -- ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి", "రూపా రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలి" అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణానికి పునాది వంటిదని, ఉపాధ్యాయుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్మల్ డిస్ట్రిక్ట్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ కోరింది. రూపా రెడ్డి కుటుంబానికి సంఘం ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, న్యాయం జరిగే వరకు ఉపాధ్యాయులంతా ఐక్యంగా నిలబడతామని నాయకులు తెలిపారు. ఈ శాంతియుత కొవ్వొత్తుల ర్యాలీలో అసోసియేషన్ నాయకులు, వివిధ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యాసంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 21 :** వీణవంక మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన చింతల సూరమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.25,500 విలువైన చెక్కును ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ బల్మూరి వెంకట్ చొరవతో సీఎంఆర్ఎఫ్ సహాయం మంజూరైందనీ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు చింతల సూరమ్మ మాట్లాడుతూ, తనకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ సహాయం నిరుపేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. లబ్ధిదారులకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయాన్ని అందించేందుకుప్రజాప్రతినిధులు చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.

## చెన్నైలో పెరియార్ స్మారక సమాధి వద్ద ఘన నివాళులు

**-పెరియార్ ఆశయాలను కొనసాగించాలని బొంకూరిమధు పిలుపు**




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 21 :** సామాజిక సమానత్వం మూఢనమ్మకాల నిర్మూలన, స్త్రీల కు సమాన హక్కులు వితంతు స్త్రీలకు పునర్వివాహాల కోసం అహర్నిశలు శ్రమించిన పెరియార్ గొప్ప మానవతా మూర్తి అని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీనియర్ జర్నలిస్టు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు పిలుపునిచ్చారు, శుక్రవారం తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని,పెరియార్ ఇ,వి రామస్వామి నాయకర్ సమాధిని సందర్శి ఘన నివాళులర్పించారు, సంపన్న కుటుంబంలో పుట్టిన ఆయన అనగారిన వర్గాల కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు, పెరియర్, ఇ వి రామస్వామి నాయకర్ సమాధి వద్ద రెండు నిమిషాలు మౌనం మౌనం పాటించారు పెరియార్ సమాజానికి చేసిన సేవలను ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రామ గ్రామానికి తీసుకు వెళ్తామని అన్నారు.

## 24న తహసిల్ కార్యాలయం ప్రారంభోత్సవం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 21 :** కమాన్‌పూర్ మండల ప్రజల కలల సాకారం 24న తీరనుంది. ఈనెల 24న 75 లక్షల వ్యయంతో నిర్మించిన కమాన్‌పూర్ నూతన తహసిల్దార్ కార్యాలయం రాష్ట్ర ఐటీ పరిశ్రమలశాఖ మాత్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నారు. దీంతోపాటు శ్రీ ఆది వరహస్వామికి వెళ్లే 90లక్షల వ్యయంతో నిర్మించిన నూతన రహదారికి సైతం ప్రారంభోత్సవం చేయనున్నారు. విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీధర్‌బాబు ఈనెల 23నహైదరాబాద్‌కు చేరుకొని 24న ఈ ప్రారంభోత్సవాలతో పాటు మండల కేంద్రంలోని ఈ ఆదివారహస్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే సంబంధిత కాంట్రాక్టర్లు అధికారులు ఏర్పాటు పనుల్లో నిమగ్నమయ్యారు. ఎట్టకేలకు మండల వ్యవస్థ ప్రారంభం నుండి తహసిల్ కార్యాలయం లేక అధ్య భవనాల్లో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. తహసిల్ కార్యాలయం ప్రారంభోత్సవం అయితే నూతన శోభ సంతరించుకోనుంది.

# ఘనంగా వరలక్ష్మీ వ్రతాచరణలు

**-ఘనంగా శ్రావణ శుక్రవార వేడుకలు**





**రామ కిష్టయ్య సంగన భట్ల...**

సనాతన సాంప్రదాయాల వారసత్వ నేపథ్యం కలిగిన ప్రాచీన పుణ్య క్షేత్రమైన ధర్మపురిలో నిర్వహిస్తున్న శ్రావణ మాసోత్సవాల నేపథ్యంలో, వరలక్ష్మీ సహిత శుక్రవారం సందర్భంగా అత్యధిక సంఖ్యాకులైన భక్తులు, యాత్రికులు గోదావరి స్నానాలకై తరలి వచ్చారు. ఇటీవలి కాలంలో భక్తుల రద్దీ పెరుగుతున్న క్రమంలో, శ్రావణ మాసపు శుక్రవారం పర్వదినం నాడు ఉదయాత్పూర్వం నుండే పిల్లాపాపలతో, గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించి, మహా సంకల్పాది పూజ నుంచి, గోదావరి మాతను అర్చించారు. జీవనదియైన గోదావరి తమను ఎల్ల వేళలా కరుణించి, కాపాడాలని భక్తి ప్రపత్తులతో అర్థించారు. పర్వకాలంలో మహిళలు పెద్ద సంఖ్యలో ముత్తయిదువులకు వాయినాలను సమర్పించు కున్నారు. మహా సంకల్పం, దాన ధర్మాది సత్కర్మలను ఆచరించారు. అధిక భక్తులు సనాతన ఆచారంలో భాగంగా గోదావరి తీరంలో కోడి, మేకల లాంటి జంతు బలులతో, మొక్కులు తీర్చుకున్నారు. నది వద్ద వంటలు చేసుకుని మాతకు నైవేద్యాలు సమర్పించి భుజించారు. గోదావరి పౌరోహితుల ఆధ్వర్యంలో తమ గోత్ర నామాదులతో ప్రత్యేక పూజలు,మహా సంకల్పాదులను వేదోక్త సాంప్రదాయా చరణ ప్రకారం ఆచరించారు. అనంతరం దైవదర్శనాల కొరకు ప్రధానాలయాలకు వెళ్ళి భౌతిక దూరం పాటిస్తూ, దైవ దర్శనాలు చేసుకున్నారు. మొక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా దేవస్థానంలోని ప్రధానాలయాలలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు,అర్చనలు గావించారు. శ్రీ వేంకటేశ్వర ఆలయంలో లక్ష్మీహటరీమాలను,లక్ష్మీ సూక్త హవనాలను,శ్రీవేంకటేశ్వర, యోగానంద,ఉగ్ర నరసింహ ఆలయాలలో మహా క్షీరాభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం ఎసి,ఈఓ శ్రీనివాస్ ఆద్వర్యంలో,ఆలువాల శ్రీ నివాస్,తిరుపతి,వేదపండితులు, వివిధ ఆలయాల అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక సాంప్రదాయక కార్యక్రమాలను నిర్వహించారు.

**వైభవంగా వరలక్ష్మీ దేవి పూజలు**

గోదావరి నదితీరాన వెలసిన ఆదిశక్తి,జగన్మాత,త్రిగుణాత్మక స్వరూపిణియైన శ్రీమహాలక్ష్మీ దేవి ఆలయంలో వరలక్ష్మీ శుక్రవారం సందర్భంగా ఉత్సవ వేడుకలు వైభవోపేతంగా, కన్నుల పండువగా జరిగాయి. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

**సంతోషిమాత వ్రతాలు**

శ్రీసంతోషి మాత ఆలయంలో సంతోషిమాత వ్రత ప్రారంభ, ఉద్వాసన కార్యక్రమాలలో పాల్గొన్నారు. క్షేత్రంలోని శ్రీ యోగానంద ఉగ్ర నారసింహ, శ్రీ వేంకటేశ్వర,ఆంజనేయ, శ్రీరామ లింగేశ్వర, అక్కపెల్లి రాజేశ్వర ఆలయాలలో, వాడవాడలలోగల శివ పంచాయతనాల యందు సంప్రదాయం వేదోక్త రీతిలో కన్నుల పండువగా, భక్తి ప్రపత్తులతో ప్రత్యేక పూజలు అర్చనలు గావించారు.

### సామాజిక సేవకుడు, జర్నలిస్ట్

## చీర భరత్ కుమార్‌కు 'మదర్ థెరిస్సా' అవార్డు



**చురకలు ప్రతినిధి,వరంగల్ ఆగస్టు 21 :** సామాజిక సేవ, జర్నలిజం రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వరంగల్ జిల్లా కరీమాబాద్ (40వ డివిజన్) నివాసి, ప్రముఖ జర్నలిస్ట్ చీర భరత్ కుమార్‌కు ప్రతిష్టాత్మక 'మదర్ థెరిస్సా' అవార్డు లభించింది. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రభుత్వానికి-ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ తన కలంతో అనేక సమస్యల పరిష్కారానికి భరత్ కుమార్ కృషి చేస్తున్నారు. వార్తా కథనాలతో ప్రజలను చైతన్యవంతులను చేయడమే కాకుండా, ప్రజా సమస్యలను,అధికారుల లోపాల ను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఆయన సేవలను గుర్తిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సౌజన్యంతో, 'సకల కళా సాంస్కృతిక మండలి' ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవం, మదర్ థెరిస్సా మరియు మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవ సంబరాలు-2026ను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గడ్డం సుధాకర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆగస్టు 22, 2026,సమయం సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు వేదిక రాజశ్రీ గార్డెన్, శాంతినగర్, వరంగల్ జిల్లా ఈ వేడుకల సందర్భంగా చీర భరత్ కుమార్‌కు మదర్ థెరిస్సా అవార్డును ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భరత్ కుమార్‌కు అవార్డు దక్కడం పట్ల స్థానిక ప్రజలు, తోటి జర్నలిస్టులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# సన్న వరికి బోనస్ కోసం సాగు వివరాలు నమోదు చేయాలి

**-సెప్టెంబర్ 10 నమోదుకు చివరి తేదీ**

**-హుజురాబాద్ మండల వ్యవసాయ అధికారి చందా భూమిరెడ్డి**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 21 :** ఖరీఫ్ లో తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన 7 సన్న వరి రకాలను సాగు చేస్తున్న రైతులు సన్న వడ్ల బోనస్ పొందేందుకు తమ సాగు వివరాలను ముందస్తుగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చందా భూమిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు ఫర్టిలైజర్ డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు సంబంధిత డీలర్లు విత్తన విక్రయ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. రైతులు తమ స్వంత వడ్లనువిత్తనాలుగా ఉపయో గించినట్లయితే, రైతు స్వీయ ధ్రువీకరణ పత్రమును వ్యవసాయ విస్తరణ అధికారికి సమర్పించి, ఆన్‌లైన్‌లో సాగు వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సీడ్ ప్లాంట్లు లేదా వ్యవసాయ విశ్వ విద్యాలయాల నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు, విత్తనాల కొనుగోలు రసీదు జిరాక్స్ ప్రతిని రైతు ధ్రువీకరణ పత్రముకు జత చేసి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఆన్‌లైన్‌లో సాగు వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. సాగు వివరాల నమోదుకు చివరి తేదీ 10 సెప్టెంబర్ 2026 అని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతుల తుది జాబితాను సంబంధిత గ్రామ పంచాయతీలలో ప్రదర్శిస్తామని వెల్లడించారు ఎ ఆన్‌లైన్‌లో సాగు వివరాలను నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ 500/- బోనస్ పొందేందుకు అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. రైతు సోదరులు ఎటువంటి ఆలస్యం చేయకుండా 10 సెప్టెంబర్ 2026లోగా తమ సాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చందా భూమిరెడ్డి కోరారు.

# చిరస్థాయిగా నిలిచేలా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా

-సర్పంచులు పిలిస్తే గ్రామాల్లో వాలుతా..
ప్రతి అవసరం తీరుస్తా..
-కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్‌రావు



**చురకలు విలేఖరి,కరీంనగర్, ఆగస్టు 21:** నియోజకవర్గంలోని గ్రామాలను కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసి, భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల మధ్యే ఉంటూ ప్రతి అవసరాన్ని తీర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీ నగర్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం వెలిచాల రాజేందర్‌రావు గ్రామ సర్పంచ్ సుద్దాల కమలాకర్ గౌడ్ ఉప సర్పంచ్ కచ్చు రజిత తో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేందర్ రావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై తనకు పూర్తి స్పష్టత, చిత్తశుద్ధి ఉందన్నారు. గ్రామాలను కేవలం అభివృద్ధి చేయడం కాకుండా చిరస్థాయిలో గుర్తుండిపోయేలా ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. తన తండ్రి జగపతిరావు కరీంనగర్ నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రజల మధ్యలో ఉండి, ప్రజలకు అవసరమైన ప్రతి పనిని పూర్తి చేయడానికి కంకణ బద్ధుడినై పనిచేస్తానని అన్నారు. "గ్రామాల అభివృద్ధికి 100శాతం కృతనిశ్చయంతో పనిచేస్తా. సర్పంచులు ఏ అవసరం ఉన్నా ఎల్లవేళలా నన్ను సంప్రదించవచ్చు. పలకరిస్తే పలుకుతా.. పిలిస్తే గ్రామంలో వాలుతా.. చెప్పిన పనిని సాధ్యమైనంత త్వరగా చేసి పెడతా. సర్పంచులకు తగిన గౌరవం ఇస్తా" అని వెలిచాల రాజేందర్‌రావు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి గ్రామాల అవసరాలను తీసుకెళ్లి, పెద్దఎత్తున నిధులు సాధించి మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు. జూబ్లీ నగర్ అభివృద్ధికి తనవంతు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని హామీ ఇచ్చారు. జూబ్లీ నగర్ సర్పంచ్ సుద్దాల కమలాకర్‌గౌడ్ యువ, ఉత్సాహవంతమైన నాయకుడిగా గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుద్దాల కమలాకర్ గౌడ్, ఉప సర్పంచ్ కచ్చు రజిత, ఏఎంసీ చైర్మన్ ఆకుల నర్సన్న, బోగొండ ఐలయ్య, బొద్దుల లక్ష్మీ నారాయణ, తిరుపతిరెడ్డి, జగ్గాని కనుకయ్య, జక్కం నర్సయ్య, గంగయ్య, మీసాల శంకర్, దావు మల్లయ్య, కాశిపాక రాకేష్, అనంతుల రమేష్, మూల కృష్ణారెడ్డి, ఆట్టేపు వేణు, పోరండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

- ప్రత్యేక అలంకరణలో అమ్మవారు
-పంచామృత అభిషేకాలు నిర్వహణ
-వాయనం ఇచ్చిపుచ్చుకున్న ముత్తైదువులు





**చురకలు విలేఖరి, ఇబ్రహీంపట్నం ఆగస్టు 21 :** శ్రావణమాసం శుక్ల పక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించడం అనాదిగా వస్తున్న హిందూ ఆచారం. వరాలను ప్రసాదించే దేవతగా వరలక్ష్మీదేవిని భక్తులు కొలుస్తారు. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూరు, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా, యామాపూర్, ఫకీర్ కొండాపూర్, వేములకుర్తి, బర్దిపూర్, మూలరాంపూర్, ఎర్దండి, కోమటికొండాపూర్, వర్షకొండ, ఇబ్రహీంపట్నం, అమ్మకాపేట్, డబ్బా, ఎర్రాపూర్, కేశాపూర్, కోజన్ కొత్తూరు గ్రామాల్లో మహిళలు శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే మడి ఆచారాలతో వ్రత కార్యక్రమాలను ప్రారంభించిన మహిళలు, ఇళ్లలో అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, పూజలు, కుంకుమార్చనలు చేశారు. కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సౌభాగ్యం కలకాలం నిలవాలని ఆకాంక్షిస్తూ భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు.

**ఇస్తినమ్మ వాయనం..పుచ్చుకుంటినమ్మ వాయనం..**

వరలక్ష్మీ వ్రతంలో వాయనం ఇచ్చి పుచ్చుకోవడం ప్రత్యేక సంప్రదాయంగా కొనసాగుతోంది. ముత్తైదువులు ఒకరికొకరు తమలపాకులు, వక్కపొడి, అరటిపండ్లు, కుంకుమ, పసుపు, గాజులు తదితరాలను వాయనంగా అందించుకున్నారు. ఇస్తినమ్మ వాయనం..పుచ్చుకుంటినమ్మ వాయనం అంటూ పరస్పరం వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

**వరలక్ష్మీ వ్రత కథ...**

స్కంద పురాణం ప్రకారం వరలక్ష్మీ వ్రత మహాత్మ్యాన్ని పరమేశ్వరుడు పార్వతీదేవికి వివరించినట్లు పురాణ కథనం. స్త్రీలు సకల ఐశ్వర్యాలు, సౌభాగ్యం, పుత్రపౌత్రాదులను పొందేందుకు ఆచరించాల్సిన వ్రతం గురించి పార్వతీదేవి శివుడిని అడగగా, ఆయన వరలక్ష్మీ వ్రత విశిష్టతను వివరించినట్లు చెబుతారు. అదే సందర్భంలో చారుమతి దేవి కథను కూడా శివుడు పార్వతీదేవికి వివరించినట్లు పురాణాలు పేర్కొంటాయి. భర్త పట్ల ఆదరణ, అత్తమామల పట్ల గౌరవంతో ఉత్తమ ఇల్లాలిగా జీవించిన చారుమతికి వరలక్ష్మీదేవి స్వప్నంలో దర్శనమిచ్చి, శ్రావణ శుక్ల పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం తనను ఆరాధిస్తే కోరిన వరాలను ప్రసాదిస్తానని అనుగ్రహించినట్లుకథనం. అమ్మవారి ఆదేశానుసారం చారుమతి వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి సకల సిరిసంపదలను పొందిందని పురాణ కథనం. అప్పటి నుంచి మహిళలు కుటుంబ సుఖసంతోషాలు, సౌభాగ్యం, ఐశ్వర్యం కోసం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తూ వస్తున్నారు.





## శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 21 :** శ్రావణ శుక్రవారం సందర్భంగా కమాన్ పూర్ మండలం పెంచికల్‌పేట్ గ్రామ పంచాయతీ పరిధిలో స్థానిక మహిళలతో కలిసి గ్రామ సర్పంచ్ పల్లె మాధవి గారు వరలక్ష్మీ దేవిని భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి వాయినం సమర్పించి, ప్రతి కుటుంబంపై వరలక్ష్మీ అమ్మవారి కటాక్షం ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మహిళలకు ఎంతో పవిత్రమైనదని, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం వెల్లివిరియాలని సర్పంచ్ పల్లె మాధవి  ఆకాంక్షించారు.

## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు,జాయింట్ సెక్రటరీని సన్మానించిన డా. రఘు




**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 21 :** ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా, జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన నేతలను తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ రఘు సన్మానించారు. శుక్రవారం మెట్‌పల్లిలోని టీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఏశమేని గణేష్, జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన ఎండీ ఉస్మాన్, ఏఐటీయూసీ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికైన కాతా వినయ్‌లకు డాక్టర్ రఘు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మెట్‌పల్లి పెయింటర్స్ యూనియన్ కోశాధికారిగా ఎన్నికైన మాతంగి శ్రవణ్‌ను సైతం శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన నాయకులు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డాక్టర్ రఘు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నేతలు చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, లింగంపల్లి సంజీవ్, రెండ్ల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీల విజేత నిర్మల్ అర్బన్ జట్టు



**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగష్టు, 21 :** తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-23 ట20 సిరీస్ లో నిర్మల్ అర్బన్ జట్టు విజేతగా నిలిచింది. జిల్లాలోని లక్కీ క్రికెట్ మైదానంలో ద్వితీయ స్థాయి జిల్లా అండర్-23 క్రికెట్ పోటీలను నిర్వహించగా పలు జట్లు పాల్గొన్నాయి. ఫైనల్లో నిర్మల్ రూరల్ - నిర్మల్ అర్బన్ జట్లు శుక్రవారం పైనల్లో తలపడ్డాయి. ఉత్కంఠగా సాగిన పోరులో నిర్మల్ అర్బన్ జట్టు విజయం సాధించింది. చాణక్య పాఠశాల మరియు దీక్ష కళాశాల యాజమాన్యులు సి.హెచ్.వెంకట్ రెడ్డి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆటలు ఆడటం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ఆయన క్రీడాకారుల కి వివరించారు. ఈ కార్యక్రమంలో జట్టు కోచ్ రామరాజు, ఆటగాళ్ల తల్లితండ్రులు పాల్గొన్నారు.

# నూతన ప్రభుత్వ కార్యాలయ భవనాలతో ప్రజలకు మెరుగైన సేవలు

**-ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**-రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 21:** జిల్లాలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.శుక్రవారం ధరూర్ క్యాంప్‌లో నూతనంగా మంజూరైన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగుల, ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సి.సి.ఎల్. ఏ. కమిషనర్ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాజీవ్ గాంధీ హనుమంతు,ఎం.డి.హౌసింగ్ గౌతం, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ లతో కలిసి శంకుస్థాపన చేశారు.జగిత్యాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయభవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో , మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు,భీమారం తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25కోట్ల అంచనా వ్యయంతో, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు, మాల్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.40కోట్ల అంచనా వ్యయంతో,మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.40 కోట్ల నిధులు మొత్తంగా ఆరు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి రూ.11.80 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జగిత్యాల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలు, మాల్యాల,మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఆధునిక సౌకర్యాలతో నూతన కార్యాలయ భవనాలను నిర్మించడం ద్వారా ప్రజలకుఅవసరమైన ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, సౌకర్యవంతంగా అందించేందుకు వీలవుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, అధికారులు మరియు సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అనువైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నూతన భవనాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.రెవెన్యూ,రిజిస్ట్రేషన్ తదితర శాఖల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.కార్యాలయాల నిర్మాణంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లాలో పరిపాలనా సౌకర్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన,సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రిస్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో శాసనమండలి సభ్యులు ఎల్.రమణ, చొప్పదండి శాసనసభ్యులు మేడిపెల్లి సత్యం, వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు, అదనపు కలెక్టర్లు బిఎస్.లత, బి. రాజ గౌడ్, జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, జగిత్యాల, మెట్‌పెల్లి,కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్,నరసింహ రావు, జీవాకర్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగజ్యోతి, మెట్ పెల్లి మున్సిపల్ చైర్మన్, కోరుట్ల మున్సిపల్ చైర్మన్, రాయికల్ మున్సిపల్ చైర్మన్, ఆయా మండలాల స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి దృష్టికి హుజురాబాద్ జర్నలిస్టుల సమస్య



**-జర్నలిస్టులకే వేధింపులా?**

**-స్వామిరెడ్డిని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ కుట్రలు**

**-బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు ధ్వజం**

**-జర్నలిస్టుల దీక్షలకు బిజెపి సంఘీభావం**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 21 :** హుజురాబాద్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న నివాస స్థలాల సమస్యను కేంద్రమంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకువెళ్తామని, సమస్య పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని బీజేపీ హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు అన్నారు. హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆరో రోజుకు చేరుకున్నాయి.బీజేపీ నాయకులు దీక్షా శిబిరాన్ని శుక్రవారం సందర్శించి తమసంపూర్ణ సంఘీ భావాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా బిజెపి పట్టణాధ్యక్షుడు తూర్పాటి రాజు మాట్లాడుతూ.. సమాజ హితం కోసం, ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తే జర్నలిస్టుల న్యాయమైన హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని, కలం యోధులు తిరగబడితే గతంలో ఎందరో పాలకుల సింహాసనాలు కుప్పకూలిన చరిత్ర ఉందని అన్నారు. జర్నలిస్టుల నివాస స్థలాలపై కేసు వేసిన కాంగ్రెస్ నాయకుడు స్వామి రెడ్డి వెంటనే కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు జర్నలిస్టుల పోరాటానికి దన్నుగా నిలుస్తుంటే, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మాత్రం గూడూరు స్వామిరెడ్డిని పావుగా వాడుకుని జర్నలిస్టులను రోడ్డున పడేసేలా కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. అన్యాయాన్ని ప్రశ్నించే జర్నలిస్టులు తలచుకుంటే ముఖ్యమంత్రుల పీఠాలే కదిలిపోయాయని,అలాంటిది స్వామిరెడ్డి వంటి వ్యక్తులు ఓ లెక్కే కాదని ఘాటుగా హెచ్చరించారు.కలం పట్టే చేతులే అవసరమైతే ప్రజా పోరాటాల ఆయుధాలుగా మారుతాయని స్పష్టం చేశారు. జర్నలిస్టుల కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగేవరకు బీజేపీ శ్రేణులు అండగా ఉంటాయనిభరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో బీజేపీ హుజూరాబాద్ పట్టణ నాయకులు పోతుల సంజీవ్, గంగిశెట్టి రాజు,రావుల వేణు,తిప్పబత్తిని రాజు, గంగి శెట్టి ప్రభాకర్, సంజీవరెడ్డి, వెంకన్న, గంట సంపత్,కొలిపాక శ్రీనివాస్,ఎర్ర శ్రావణ్,ఇల్లందుల ప్రణీత్,ఉద్నాల విజయ్,జేఏసీ నాయకులు వేల్పుల రత్నం,ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక సమ్మయ్యతో పాటు బీజేపీ కార్యకర్తలు, హుజూరా బాద్ ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా కళాకారులు ఆల పించిన చైతన్య గీతాలు ఆలోచింపజేశాయి.

# భూ బాధితులకు న్యాయం చేయండి

**-22ఏ భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలి**

**-మంత్రి పొంగులేటికి వెలిచాల రాజేందర్‌రావు విజ్ఞప్తి**



**చురకలు ప్రతినిధి, కరీంనగర్ , ఆగస్టు 21:** కరీంనగర్లో 22ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూముల బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం జగిత్యాలలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లోని కొత్తపల్లి, రేకుర్తి, విద్యానగర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు 22ఏ నిషేధిత జాబితా కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాజేందర్‌రావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.గతంలో రిజిస్ట్రేషన్లు జరిగిన భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో వాటి క్రయవిక్రయాలు నిలిచిపోయాయని తెలిపారు.ఈ భూముల్లో ఎక్కువగా చిన్న, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఉన్నారని, చాలామంది ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు నిర్మించు కుని నివసిస్తున్నారని వివరించారు. ఇంటిపన్నులు చెల్లిస్తూ, గృహ నిర్మాణ రుణాలు పొందిన వారికి రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తోందన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తి, విద్యానగర్,కొత్తపల్లి ప్రాంతాల్లో 22ఏ నిషేధిత జాబితా కారణంగా వేలాది మంది ఇబ్బందులు పడుతున్నారని రాజేందర్‌రావు తెలిపారు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం రేకుర్తి ప్రాంతంలో సుమారు 125 సర్వే నంబర్ల పరిధిలో 555 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని,ఈ భూముల్లో సుమారు 3వేల ఇళ్లు,6 వేల ప్లాట్లు ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. విద్యానగర్‌కు సంబంధించిన కొన్ని సర్వే నంబర్లలో సుమారు 536 ఎకరాలు, మరో 16 సర్వే నంబర్లలో 115 ఎకరాలు, అలాగే కొత్తపల్లి ప్రాంతంలోని మరికొన్ని పట్టా భూములు 22ఏ జాబితాలో చేరడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని ఆయన వివరించారు. మొత్తం 230 సర్వే నెంబర్లలో 1000 ఎకరాలకు పైగా భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లాయని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.విద్య, వైద్యం, వివాహాలు, కుటుంబ అవసరాల కోసం తమ భూములను విక్రయించుకోవాల్సిన పరిస్థితుల్లో ఉన్న బాధితులు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వివాదాలు, కోర్టు కేసులు లేని అర్హత కలిగిన పట్టా భూములను నిబంధనల ప్రకారం పరిశీలించి 22ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని కోరారు.



**మంత్రి సానుకూల స్పందన**

రాజేందర్‌రావు విజ్ఞప్తిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.22ఏ భూముల సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు రాజేందర్‌రావు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల అనంతరం రాజేందర్‌రావు కరీంనగర్ కలెక్టర్‌తో రెండుసార్లు ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కలెక్టర్ సైతం చొరవ చూపుతున్నారని తెలిపారు. "నిషేధిత భూముల కారణంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు న్యాయం జరిగే వరకు వారి తరఫున పోరాడుతాను. మంత్రి సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ కూడా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. అర్హత ఉన్న భూముల విషయంలో త్వరలోనే మంచి నిర్ణయం వస్తుంది. బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు.

# పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి పొంగులేటికి వినతి



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు,21 :** జగిత్యాల జిల్లా పర్యటనకు విచ్చేసిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కలిసి పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావుల సూచన మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి పట్టణంలోని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. వినతిపత్రంపై మంత్రి సానుకూలంగా స్పందించారని పట్టణ అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ వెల్లడించారు.